క్లుప్తంగా

మరిన్ని స్కామ్‌లు బయటకు వస్తాయి



మాట్లాడుతున్న నాయకులు

శ్రీరంగరాజపురం: రాష్ట్రంలో రాజ్యాంగం బతికే ఉందని మరొకసారి చంద్రబాబు తీర్పు తో తేట తెల్లమైనట్లు జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం శ్రీరంగరాజపురంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఆత్మ శాంతించాలని, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం బతికే ఉందని వారి చి త్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశంలోనే అవినీతిని పెంచి పోషించిన చంద్రబాబు నాయుడు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చారన్నారు. స్కిల్ స్కామ్ కాకుండా అమరావతి, ఈఎస్‌ఐ స్కామ్, పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టు కుంభకోణాలు కూడా బయటకు వస్తాయన్నారు. కార్యక్రమంలో మండల కన్వీ నర్ మణి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు దిలీప్‌రె డ్డి, నాయకులు జనార్దన్, హరి, మణి, భూపతి రెడ్డి, బాబు, ప్రసాద్ రెడ్డి, మునికృష్ణ, వీరరాఘవులు, రామచంద్ర యాదవ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, నాయకులు

కార్వేటినగరం: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని టీపీఎం వీధిలో రూ.4 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ ధనుంజయవర్మ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి మండల కేంద్రాన్ని దత్తత తీసుకుని మరింత అభివృద్ధి చేస్తున్నారని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి వీధిలో సీసీ రోడ్డుతో పాటు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లోపు కార్వేటినగరం గ్రామాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు గిరిజ, వార్డు మెంబర్ రత్నంరెడ్డి, నాయకులు జేజేలురెడ్డి, ధనశేఖర్‌వర్మ, వరాలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కార్వేటినగరం: మంచికి మారుపేరుగా, యువతకు ఆదర్శంగా నిలుస్తున్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ ఘనంగా నిర్వహించారు. అలాగే రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పురంధర్, నాయకులు ధనశేఖర్‌వర్మ, పురుషోత్తంరాజు, సుబ్రమణ్యం, సర్వేశ్వర్, మురళీకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ అమీద్, శ్రీనివాసులు, మణి, జయకుమార్, జేజేలురెడ్డి, వరాలురెడ్డి, ధనశేఖర్ మొదలియార్, శేఖర్, రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

నగరి : మండలంలోని బుగ్గఅగ్రహారంలో టీటీడీ అనుబంధంగా ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో సోమవారం దాతలు భక్తులకు అన్నదానం చేశారు. దర్శనానికి విచ్చేసిన భక్తులకు పి.కొత్తకోట, మన్నారుపల్లికి చెందిన ఎం.ఫాల్గుణ అనే దాత ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్నదానం చేశారు. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పుత్తూరులో 'జగనన్నకు చెబుదాం' రేపు

పుత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం స్థానిక ఏడీకే కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. పుత్తూరు అర్బన్, రూరల్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా పాల్గొనాలని కోరారు.

గంగమ్మకు టీటీడీ సారె

- వారం రోజుల్లోనే జాతర నిర్వాహకుల వినతికి పరిష్కారం
- జాతర చరిత్రలోనే నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిన మంత్రి ఆర్‌కే రోజా
- ఈసారి నుంచే అమ్మవారికి శ్రీవారి సారె
- హర్షం వ్యక్తం చేస్తున్న నగరి ప్రజలు





మంత్రి రోజాకు వినతిపత్రం ఇస్తున్న జాతర నిర్వాహకులు (ఫైల్) (ఇన్‌సెట్) సారెను అందించనున్నట్లు టీటీడీ నుంచి వచ్చిన ఉత్తర్వులు

నగరి : ఎంతో ప్రసిద్ధి చెందిన నగరి గంగమ్మ జాతరకు ఈసారి నుంచి నూతన శోభ సమకూరనుంది. మంత్రి ఆర్‌కే రోజా చొరవతో జాతర చరిత్రలోనే తొలిసారి గంగమ్మకు శ్రీవారి సారె అందనుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతిలో గంగజాతర ప్రారంభమై నగరి జాతరతో ముగింపునకు చేరుకుంటుంది. 400 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న ఈ జాతర ప్రత్యేకంగా నిలుస్తోంది. జాతర నిర్వాహకులు ఏర్పాటు చేసిన గ్రామసభలో టీటీడీ నుంచి గంగమ్మకు సారె అందేలా చూడాలని మంత్రి రోజాకు గత నెల 30వ తేదీన జాతరకు ఆహ్వానించడంతో పాటు వినతిపత్రం అందజేశారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో చర్చించగా ఈ నెల 5వ తేదీన సారె అందిస్తున్నట్లు ఆర్వోసీ నంబరు 12021(73)/52/2023 మేరకు టీటీడీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి సి.గుణభూషణ రెడ్డి నుంచి ఆదేశాలు అందాయి. టీటీడీ సారెను గంగమ్మకు అందించాలన్న గ్రామపెద్దలు, జాతర నిర్వాహకుల కోరికను మంత్రి ఆర్కేరోజా తీర్చారు. జాతర నిర్వాహకులు సారెను అందుకునేందుకు టీటీడీ అధికారులను సోమవారం తిరుపతికి వెళ్లి కలిశారు.

నూతన అధ్యాయానికి శ్రీకారం..

నగరి గంగజాతర చరిత్రలో నూతన అధ్యాయానికి మంత్రి ఆర్‌కే రోజా శ్రీకారం చుట్టారు. ఈ నెల 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న గంగజాతరలోనే టీటీడీపీ తరపు నుంచి జాతర చరిత్రలో తొలిసారిగా శ్రీవారి సారె గంగమ్మకు అందనుంది. అమ్మవారికి శేషవస్త్రాలు, పెండ్యాళ్లు అందించడంతో పాటు పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణలు ఉచితంగా టీటీడీ వారు నిర్వహించనున్నారు. ఇందుకోసం రూ.లక్షను టీటీడీ వెచ్చించనుంది. దీంతో నగరి గంగజాతర నూతన హంగులను సంతరించుకుంది.



మంత్రి రోజాకు రుణపడి ఉంటాం

ఉమ్మడి జిల్లాలో నగరి జాతర ప్రత్యేకం. 400 ఏళ్లకు పైగా ఈ జాతర జరుగుతోంది. జిల్లాలో జాతరలు తిరుపతిలో ప్రారంభమై నగరితో పూర్తవుతుంది. నగరిలో గంగమ్మ జాతర చాలా ప్రసిద్ధి. జాతరను వైభవంగా నిర్వహించాలనేది అందరి కోరిక. గ్రామసభలో గంగమ్మకు టీటీడీ నుంచి సారె ఇప్పించేలా చూడాలని నిర్ణయించి మంత్రి రోజాకు విన్నవించాం. వెంటనే స్పందించిన ఆమె గంగమ్మకు శ్రీవారి సారె వచ్చేలా చేశారు. ఆమెకు నగరి ప్రజలు రుణపడి ఉంటారు.

– నరసింహారెడ్డి, జాతర నిర్వాహకులు, నగరి



గ్రామస్తుల కోరిక నెరవేరింది..

గ్రామసభలో తీసుకున్న నిర్ణయాన్ని మంత్రి రోజాకు గత నెల 30వ తేదీన జాతరకు ఆహ్వానించే సమయంలో విన్నవించుకున్నాం. స్పందించిన ఆమె ఈ అంశాన్ని టీటీడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 5వ తేదీ నాటికి ఉత్తర్వులు వచ్చాయంటే ఆమె ఎంత వేగంగా స్పందించారో తెలుస్తోంది. గ్రామస్తుల కోరిక నెరవేరింది. ప్రజాభీష్టాన్ని నెరవేర్చడంలో ఆమె ఎప్పుడూ ముందుంటారని ఈ అంశం రుజువు చేసింది.

– దయానిధి, నగరి



సువర్ణ అక్షరాలతో లిఖించదగిన అంశం..

గంగమ్మ జాతరకు శ్రీవారి సారె అందేలా చేయడం జాతర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ అంశం. గ్రామసభలో ఈ అంశం చర్చకు వచ్చే సమయంలో ఈ ఏడాదికి ఇది సాధ్యమవుతుందా అన్న చర్చ వచ్చింది. ఉన్న సమయం తక్కువ ఆలోపు ఇదెలా సాధ్యమనే సందేహం పలువురిలో కలిగింది. అయితే మంత్రి ఆర్‌కే రోజా అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. ఆమెకు పట్టణ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాను.

– గోపాల్‌రెడ్డి, నగరి



అమ్మవారి ఆశీస్సులు ఉంటాయి..

గంగమ్మ పట్టణ ప్రజలు ఎక్కువగా ఆరాధించే దైవం. జాతర మొక్కులు తీర్చుకోవడానికి జనం క్యూ కడుతూ ఉన్నారంటే వారికి ఉన్న నమ్మకం అలాంటిది. ఏటా వైభవంగా జరిగే ఈ జాతరకు మంత్రి ఆర్‌కే రోజా సహకారంతో ఈ ఏడాది కొత్తకళ వచ్చింది. జాతర చరిత్రలో తొలిసారిగా టీటీడీ సారె గంగమ్మకు అందనుంది. ప్రజల ఆకాంక్షను ఆమె నెరవేర్చారు. ఆమెకు అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉంటుంది.

– ఇంద్రయ్య, నగరి

పిలాసపాలెం రోడ్డుకు భూమిపూజ



పిలాసపాలెం రోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

విజయపురం (నగరి): మండలంలోని పన్నూరు రోడ్డు నుంచి పిలాసపాలెం వెళ్లే రోడ్డుకు మంత్రి ఆర్కే రోజా సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దశాబ్దకాలంగా రోడ్డు దుస్థితిలో ఉందని, గడప గడపకు కార్యక్రమంలో ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టు ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు నుంచి రూ.2.9 కోట్ల నిధులు మంజూరు అయినట్లు ఆమె తెలిపారు. సుమారు 5 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మిస్తామని, ఇది పూర్తయితే సుమారు 15 గ్రామాల ప్రజలకు, రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. దశాబ్దాల తరువాత రోడ్డు ఏర్పాటు అవుతుండడంపై పన్నూరు ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి ఆర్‌కే రోజాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఈ సుబ్బరాయుడు, ఎంపీడీఓ ప్రసాద్, పీఆర్ఏఈ వీరభద్ర, సర్పంచ్ కుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు హరి బాబునాయుడు, జిల్‌దాస్, బాబు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం షెడ్డు ఏర్పాటు

వెదురుకుప్పం: మండలంలోని దిగువపల్లాలు గ్రామంలో ఉన్న శ్రీ కృష్ణ ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం కొత్తగా షెడ్డు ఏర్పాటైంది. నిర్మించారు. స్థానిక సర్పంచ్ భారతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో తన కుమారుడు దినేష్ రెడ్డి జ్ఞాపకార్థం భక్తుల విడిది కోసం వసతి సముదాయాన్ని ఏర్పాటు చేసినట్లు దాతలు తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా వసతి సముదాయాన్ని ప్రారంభినట్లు చెప్పారు. అనంతరం దాతలు కోలాట భజన భక్తులకు రూ.1116 విరాళంగా అందించారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు వెల్లడించారు.

వైభవంగా వేణుగోపాలుని పవిత్రోత్సవాలు



ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు

- కనుల పండువగా స్నపన తిరుమంజనం
- పవిత్రాలను ఊరేగింపుగా తెచ్చి స్వామివారికి సమర్పించిన అర్చకులు



పవిత్రాలను ఊరేగింపుగా తెస్తున్న టీటీడీ అధికారులు, వేదపండితులు

కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలను టీటీడీ సిబ్బంది ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేపట్టారు. పవిత్రోత్సవాల సందర్భంగా టీటీడీ వేదపండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక హోమాలు చేపట్టారు. అనంతరం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారికి పాలు, తేనె, పెరుగు, పసుపు, చందనం, నారికేళ జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో అర్చకులు వేదమంత్రాల నడుమ మేళతాలతో అంగరంగ వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట మధ్య వేద పండితులు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారికి పవిత్రాల సమర్పణ అత్యంత రమణీయంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అగ్నిహోమం, ప్రతిష్ట నవకలశ స్థాపన, పవిత్ర ప్రతిష్టహోమం వంటి కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టువస్త్ర సుగంధ భరితపుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పురవీధుల్లో ఊరేగిన వేణుగోపాలుడు..

కార్వేటినగరం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం ఉభయ నాంచారులతో పాటు శ్రీవేణుగోపాలున్ని ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి నగర వీధుల్లో చెక్కభజనలు, కోలాటాలు, మేళతాళాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం 6 గంటల నుంచి 8 గంటల వరకు యాగశాల, వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు ఆచార్య బహుమానాన్ని అందజేశారు. అనంతరం 9.45 గంటలకు స్వామివారిని ఏకాంతసేవలో పవళింపజేశారు. కార్యక్రమంలో ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండమల్లీశ్వరుడికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశ్వరుడికి పాలాభిషేకం చేశారు. స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

వలంటీర్ల భర్తీకి ఇంటర్వ్యూలు

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టుల భర్తీకి సోమవారం ఎంపీడీఓ నీలకంఠేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈఓపీఆర్డీ ప్రభుకిరణ్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ మండల పరిధిలోని సాతంబాకం, ఎల్కేపీడూరు, కలవకుంట, కలికిరి సచివాలయాల పరిధిలో ఖాళీ గా ఉన్న వలంటీర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల అర్హతల ఆధారంగా వలంటీర్లను ఎంపిక చేస్తామన్నారు. కలికిరి సచివాలయ పరిధిలో మరో వలంటీర్ పోస్టు ఖాళీగా ఉందని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణచంద్రారెడ్డి, పలువురు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

పాలసముద్రం : తేలిక భూముల్లో సాగు చేసిన చెరుకు పంటను చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయని డీఆర్‌సీ–డీటీసీ వ్యవసాయ సంచాలకులు టీవీ నాగపద్మని తెలిపారు. సోమవారం ఆమె మండలంలోని కృష్ణజమ్మపురం, పాలసముద్రం గ్రామాల్లో రైతులు సాగుచేసిన చెరుకు, వేరుశనగ పంటను ఆమె క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ చెరుకు నాటినప్పటి నుంచి కోత వరకు పీక, కాండ తొలుచు పురుగులు పంటకు నష్టం కలిగిస్తాయన్నారు. మొలక దశలో పీకపురుగు లోపలి భాగాలను తినడం వల్ల మొవ్వ ఎండిపోతుందన్నారు. నాటిన పంటను కార్సి(మమ్ము)తోటల్లో ఇది ఎక్కువగా ఆశిస్తుందని తెలిపారు. అందుకు లోతైన కాలువల్లో ముచ్చెలను, కణుపులను నాటాలని, నాటే ముందు ఎకరాకు 10 కిలోల మిథైల్ పెరాథియాన్ మందును లేదా 6 కిలోల ఫారెట్ 10 గుళికలను వేయాలని సూచించారు. వీలైనంత తక్కువ వ్యవధిలో దగ్గరగా నీటి తడపాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు డిల్లీప్రసాద్, లక్ష్మీ, ప్రసన్న, సుధారాణి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పాలసముద్రం : ప్రస్తుతం వాతావరణంలో తలెత్తిన మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. సోమవారం వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయ ఆవరణలో 104 వైద్యాధికారి చంద్రబాబు, ఎంఎల్‌హెచ్‌ఓ కీర్తి సమక్షంలో 104 వాహన వైద్యసేవలు అందించారు. డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రజలు చిన్నచిన్న వ్యాధులకే ఆస్పత్రికి వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో 104 వాహనం ద్వారా గ్రామాల్లోనే వైద్యసేవలను పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తోందన్నారు. అనంతరం 46 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో జాతర సందడి



గంగమ్మ తల్లి ప్రతిమలు (ఫైల్)



గెరిగ ఊరేగింపు

- నేడు పుత్తూరు గంగజాతర చాటుబండి
- గంగమ్మ దర్శనం రేపు
- ఏర్పాట్లు పూర్తి చేసిన జాతర కమిటీ

పుత్తూరు రూరల్: పుత్తూరు గ్రామదేవత గంగమ్మ జాతరను ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారు. శ్రావణ మాసంలో వచ్చే వరలక్ష్మీవ్రతంతో పాటు శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి తిరునాళ్ల తరువాత పుత్తూరు జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈనెల 5వ తేదీ తొలి మంగళవారం గ్రామ దేవత ఆరేటమ్మకు పాలాభిషేక బ్రహ్మోత్సవం నిర్వహించారు. అదేరోజు రాత్రి గంగ జాతర చాటింపు వేశారు. ఈనెల 12 మంగళవారం రాత్రి 8 గంటలకు చాటుబండి ఊరేగింపు నిర్వహించనున్నారు. 13న బుధవారం స్థానిక బజారు వీధిలోని నాలుగు వీధుల కూడలిలో గంగమ్మను ప్రతిష్ఠించి జాతర నిర్వహిస్తారు. ఇందుకోసం బజారు వీధిలోని నాలుగు వీధుల కూడలి వద్ద చలువ పందిళ్లు, వస్త్రాలంకరణ, అమ్మవారి ఆలయానికి ప్రత్యేక విద్యుత్ దీప అలంకరణలు, ఇరువైపులా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

గెరిగ, చాటుబండి ఊరేగింపు..

గంగ జాతరను పురస్కరించుకుని ఆదివారం నుంచి బుధవారం వరకు 4 రోజుల పాటు గెరిగ పట్టణంలోని ప్రతి వీధిలో ఊరేగిస్తారు. అలాగే మంగళవారం రాత్రి 8 గంటలకు బజారువీధిలోని గంగమ్మ ఆలయం నుంచి నిర్వాహకులు మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరి కాపువీధిలోని కేశవ ఆచారి కుటుంబం వారు తయారు చేసిన చాటుబండికి పూజలు చేస్తారు. అక్కడ నుంచి చాటుబండిని తీసుకుని మండపం వద్ద ఉంచి పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆరేటమ్మ ఆలయం వద్దకు వెళ్లి పసుపు–కుంకుమ సమర్పిస్తారు. తిరుగు ప్రయాణంలో దివిలి వెంకట్రాయులు మందడి కుటుంబం వారిచే చాటుబండి బలిదానం నిర్వహిస్తారు. అక్కడ నుంచి కుమ్మరి కన్నయ్య ఇంటికి వెళ్లి గంగ పెట్టె తీసుకుని మండపం వద్దకు చేరుకుంటారు. అక్కడ అన్నంతో దీపం వెలిగించి పూజలు నిర్వహిస్తారు.

తొలిపూజ ఇలా..

బుధవారం ఉదయం 4 గంటలకు అమ్మవారి ప్రతిష్ట అనంతరం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీగా కోడి, మేకపోతు, దున్నపోతులను బలిదానం చేయడంతో అమ్మవారు కన్నులు తెరుస్తారు. అమ్మవారి తొలిహారతిని బెస్త సంఘం పినపెద్దకు ఇస్తారు. అనంతరం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. అలాగే బుధవారం రాత్రి 7 గంటలకు కాపు వీధిలో పాటకచేరీ నిర్వహిస్తారు. 9 గంటలకు బెస్త సంఘం వారిచే గంగమ్మకు ముత్యాల హారతి ఇస్తారు. దీంతో జాతర పరిసమాప్తి అవుతుంది. అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా తీసుకుని వెళ్లి అమ్మోరుగుంటలో నిమజ్జనం చేస్తారు.

కనిపించని బంద్ ప్రభావం



గంగాధరనెల్లూరులో టీడీపీ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



నగరి పట్టణంలో యథావిధిగా జనజీవనం

- తూతూమంత్రంగా ధర్నా చేసి వెళ్లిపోయిన టీడీపీ నాయకులు
- ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు

కార్వేటినగరం: గంగాధరనెల్లూరు నియోజకవర్గ స్థాయిలో తెలుగు తమ్ముళ్లు చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ చేపట్టిన నిరసనలో ఎక్కడ పెద్దఎత్తున ప్రభావం కనిపించలేదు. ముఖ్యనేతలను ముందస్తుగా హౌస్ అరెస్టు చేయడంతో టీడీపీ నాయకులు దొంగచాటుగా రోడ్లపైకి వచ్చి నినాదాలు చేశారు. కార్వేటినగరంలో టీడీపీ, జనసేన నాయకులు గుర్తింపు కోసం చేసిన నిరసనతో ఎలాంటి ఉపయోగం లేకపోవడంతో ఉసూరుమంటూ పలువురు వెనుదిరిగారు. దుకాణాలు యథావిధిగా తెరుచుకున్నాయి. పెనుమూరు మండలంలో కొందరు టీడీపీ నాయకులు రోడ్లపై టైర్లు కాల్చి నిరసన వ్యక్తం చేశారు. అలాగే శ్రీరంగరాజపురంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జయశంకర్ నాయుడు ఉదయం 6 గంటలకే నిరసన చేయడానికి రోడ్డుపైకి రావడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే జీడీ నెల్లూరు మండలం తానా వద్ద టీడీపీకి చెందిన పలువురు వాహనాలను ఆపి నిరసన చేస్తున్న విషయం తెలిసి పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పోలీస్ వాహనంలో స్టేషన్‌కు తరలించారు. వెదురుకుప్పం మండలంలో పార్టీ కన్వీనర్ లోకనాథం రెడ్డి ఆధ్వర్యంలో తూతూమంత్రంగా నిరసన చేసి వెళ్లిపోయారు. పాలసముద్రం మండలంలో టీడీపీ రాష్ట్ర క్రియాశీలక సభ్యుడు చిట్టిబాబుతో పాటు పలువురు నాయకులను పోలీసులు ఇళ్లకే పరిమితం చేయడంతో నిరసన ప్రభావం ఎక్కడా కనిపించలేదు.

నగరిలో..

నగరి : మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్టుతో టీడీపీ, జనసేన, ఎమ్మార్పీఎస్ పార్టీలు ఇచ్చిన రాష్ట్రబంద్ ప్రభావం నగరి నియోజకవర్గంలో కనిపించలేదు. జనజీవనం యథావిధిగా కొనసాగింది. దుకాణాలు మూయడానికి వ్యాపారులు ఏమాత్రం ఆసక్తి చూపలేదు. దీంతో ఎక్కడా బంద్ ఛాయలు కనిపించలేదు. బస్సులు, ఆటోలతో పాటు ఇతర వాహనాలన్నీ యథావిధిగా రోడ్డుపై ప్రయాణించాయి. మచ్చుకైనా బంద్ ప్రభావం ఎక్కడా కనిపించలేదు. దీంతో కోర్టు తీర్పును ప్రజలు స్వాగతించినట్లు అయింది.


చంద్రబాబుకు శిక్ష తప్పదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలసముద్రం : స్కామ్‌లు చేయడంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మంచి స్కిల్ ఉన్నవ్యక్తి అని రూ.వందల కోట్ల అవినీతి చేస్తే అరెస్టు చేయకూడదా ? అని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ ప్రశ్నించారు. సోమవారం పాలసముద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. స్కామ్‌లు చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని, అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు, స్కిల్ డెవలప్‌మెంట్, నీరు–చెట్టు ఇలా అనేక కార్యక్రమాల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. సీమెన్ కంపెనీతో ఒప్పందం లేకపోయినా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ప్రజాధనాన్ని కొల్లగొట్టడంతో పాటు నిరుద్యోగ యువత జీవితాలతో ఆడుకున్నారని విమర్శించారు. పక్కా ఆధారాలతో పట్టుబడిన చంద్రబాబుకు ఈసారి శిక్ష తప్పదన్నారు. విచారణను తప్పుదోవ పట్టించేందుకు చంద్రబాబు యత్నిస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, అయ్యప్ప, ఎంపీటీసీ గోవిందరాజ్, నాయకులు విజయరాఘవరెడ్డి, అరుల్, బాబు, రవి, వేణు, గోపాల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చట్టానికి ఎవరూ అతీతులు కాదు



వెదురుకుప్పం: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెదురుకుప్పం: ప్రజాధనాన్ని దోపిడీ చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తున్న టీడీపీ తీరు అప్రజాస్వామికమని, తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవించాల్సిందేనని ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మరకాలకుప్పం రామయ్య అన్నారు. సోమవారం వెదురుకుప్పంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టానికి ఎవరూ అతీతులు కారని తెలిపారు. చంద్రబాబు తనకు తాను నిప్పు అంటూ చెప్పుకుని తిరుగుతూ గత 40 ఏళ్లుగా ప్రజాధనాన్ని లూటీ చేసినట్లు ఆరోపించారు. బాబు అవినీతి సామ్రాజ్యంపై పలుమార్లు కోర్టుల్లో కేసులు వేసినా వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చారని ఆరోపించారు. తాజాగా స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో వందల కోట్లు అవినీతికి పాల్పడినట్లు రుజువైందన్నారు. కానీ టీడీపీ, జనసేన నాయకులు తప్పు చేసిన చంద్రబాబును వెనకేసుకు రావడం సిగ్గు చేటన్నారు. అలాగే గంగాధరనెల్లూరు టీడీపీ ఇన్‌చార్జ్ థామస్ కూడా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిపై విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. చెన్నైలో థామస్‌పై ఎన్ని కేసులు ఉన్నాయో అందరికీ తెలుసన్నారు. అనవసరంగా మంత్రిపై నోరు పారేసుకుంటే అతని కేసుల చిట్టాను ప్రజల ముందు ఉంచుతామన్నారు. కార్యక్రమంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గ బూత్‌కమిటీ కన్వీనర్ నారాయణ రెడ్డి, బొమ్మయ్యపల్లె సర్పంచ్ చొక్కా గోవిందయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, మాజీ సర్పంచ్ గోవిందన్, బొజ్జారెడ్డి, మునికృష్ణ పాల్గొన్నారు.